క్లుప్తంగా

చేయూత



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన మారపాక రవి, మారపాక అన్వేష్, పండుగ రాజు, తెల్జూరి ఎల్లమ్మ ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాలను మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున మొత్తం రూ.20వేల సాయం అందజేశారు. కట్టమల్లు, మారపాక రాములు, మార్క శ్రీను, పండుగ బద్రి, మారపాక శ్రీను, పాలకుర్తి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్‌ల పంపిణీ



చిల్పూరు: బాలవికాస సేవా సంస్థ ఆధ్వర్యంలో సంస్థ ఫౌండర్ బాల జింగ్రాస్ ఆదేశానుసారం బాలవికాస డైరెక్టర్ ఆధ్వర్యంలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆదివారం ల్యాప్‌టాప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా మల్లక్‌పల్లి బాలవికాస సెంటర్ కోఆర్డినేటర్ స్వప్న మాట్లాడుతూ ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్‌లలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసి ల్యాప్‌టాప్‌లు అందజేయడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా వంగాలపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అరూరి ప్రణీతప్రదీపల కూతురు ఏంజిల్ తదితరులు ఆదివారం ల్యాప్‌టాప్ అందుకున్నట్లు తెలిపారు.

ఎన్నిక



మంగమ్మ, భాగ్యలక్ష్మి

దేవరుప్పుల: ఐసీడీఎస్ విభాగంలో అంగన్‌వాడీ టీచర్ల అసోసియేషన్ కొడకండ్ల ప్రాజెక్టు విభాగం కార్యదర్శిగా కొమ్ము మంగమ్మ, కార్యదర్శిగా కారుపోతుల భాగ్యలక్ష్మి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా కౌమార దశ బాలికల నుంచి పుట్టిన ప్రతి శిశువు అభ్యున్నతి కోసం పాటుపడుతున్న అంగన్‌వాడీ టీచర్ల న్యాయపరమైన హక్కుల సాధన కోసం అసోసియేషన్ పిలుపు మేరకు చేపట్టే కార్యక్రమాల విజయవంతం కోసం పాటుపడుతామన్నారు. వీరిద్దరి నియమాకం పట్ల గండిపెల్లి రామతార, ఉపేంద్ర, మంగమ్మ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

'భగీరథ' పైపులైన్ లీకేజీ



బచ్చన్నపేట: మండలంలోని గోపాల్‌నగర్ గ్రామంలో ప్రధాన చౌరస్తా వద్ద భగీరథ పైపు లైను లీకేజీ అయి నాలుగు రోజులు కావస్తోంది. గ్రామానికి భగీరథ నీరు మురుగు నీటితో కలిసి పైపుల ద్వారా సరఫరా అవుతోంది. దీంతో కలుషితమైన నీరు తాగి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా పైపు లైను లీకేజీకి మరమ్మతు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వ్యక్తి ఆత్మహత్య



సమ్మయ్య (ఫైల్)

రఘునాథపల్లి: మద్యం మత్తులో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని భాంజీపేటలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అమృతం సమ్మయ్య (49) కొన్నాళ్లుగా మద్యం అతిగా తాగుతూ అనారోగ్యం పాలయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన సమ్మయ్య మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యం తాగి అదే మత్తులో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వచ్చి చూడగా అప్పటికే సమ్మయ్య మృతి చెంది ఉన్నాడు. మృతుడికి భార్య సులోచన, ఇద్దరు కుమారులు నితిన్, రాకేష్ ఉన్నారు. మృతుడి భార్య సులోచన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

చిల్పూరు: ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ హెచ్చరించారు. నష్కల్ ఆకేరు వాగునుంచి ఆదివారం రాత్రి అక్రమంగా గొడుగు రమేశ్ ఇసుకను ఇందిరమ్మ ఇళ్ల పేరుతో తరలిస్తున్నాడనే పక్కా సమాచారం మేరకు ట్రాక్టర్‌ను ఆపారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సీపీఆర్ చేద్దాం.. ప్రాణం పోద్దాం

● ముగిసిన అవగాహన వారోత్సవాలు



కొడకండ్ల టీఎస్‌ఆర్‌జేసీలో విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ హరికృష్ణ



ప్రయాణికులకు సీఆర్‌పీపై అవగాహన కల్పిస్తున్న 108 సిబ్బంది

పాలకుర్తి టౌన్: ప్రస్తుత కాలంలో వయస్సుకు సంబంధం లేకుండా పిల్లల నుంచి వృద్ధుల వరకు గుండెపోటు సమస్య ఎదుర్కొంటున్నారు. వ్యాయామం లేకపోవటం, రోజువారీ ఆహారంలో తేడాలు, జంక్ ఫుడ్ తినడంతో రక్తనాళాల్లో పేరుకుపోయిన రక్త సరఫరాను అడ్డుకోవడంతో ఈ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఏటా గుండెపోటు మరణాల సంఖ్య పెరుగుతోంది. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు వైద్యారోగ్యశాఖ సీపీఆర్(కార్డియో పల్మనరీ రిసిటేషన్) పై ప్రజలకు అవగాహన కలిగించేందుకు వారోత్సవాలను నిర్వహిస్తోంది. ఈనెల 13 నుంచి ఉమ్మడి జిల్లాలో ప్రారంభమైన వారోత్సవాలు 17 వరకు నిర్వహించినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఆరోగ్య ఉప కేంద్రాలు, జిల్లా కేంద్రాలు, మహిళా సంఘలు, కళాశాలలు, పాఠశాలలో, ప్రభుత్వ కార్యాలయంలో కార్మికులు ఉండే ప్రదేశాల్లో ఆరోగ్య కార్యకర్తలు, 108 సిబ్బంది, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కృత్రిమ మానవ దేహంతో అవగాహన కలిస్తున్నారు. గుండెపోటు రాకుండా చేపట్టాల్సిన చర్యలతో పాటు గురైనప్పుడు తక్షణమే సీపీఆర్ ఎలా చేయాలన్న అంశంపై అవగాహన కల్పిస్తున్నారు.

ఆ మూడు, నాలుగు నిమిషాలే కీలకం..

పలువురు గుండె జబ్బులు, ఇతరత్రా కారణాలతో గుండెపోటుకు గురికావడం జరుగుతోంది. అప్పుడా వ్యక్తిని ఆస్పత్రికి తరలించే వరకు ప్రదేశాన్ని బట్టి 15 నిమిషాల నుంచి గంట సమయం పట్టవచ్చు. గుండె కొట్టుకోవడం ఆగినప్పుడు అన్ని అవయవాలకు రక్త ప్రసరణ నిలుస్తుంది. ఆక్సిజన్ అందకపోతే మెదడు మూడు, నాలుగ నిమిషాల కంటే ఎక్కువ తట్టుకోదు. ఆ లోపల సీపీఆర్ చేపట్టాలి, గుండె కొట్టుకునేలా, ఊపిరితిత్తులకు ఆక్సిజన్ అందేలా మెదడుకు రక్త ప్రసరణ జరిగేలా చేయడమనే ఈ ప్రక్రియకు మొదటి మూడు, నాలుగు నిమిషాలు కీలకం అవుతోంది. కాస్త ఈ ప్రక్రియను ఎవరైనా చేయవచ్చు.

సీపీఆర్ చేస్తే బతికేవాడు..

నాలుగు నెలల క్రితం జాతీయ గ్రామీణ హామీ పథకం ఏపీఓ పాలకుర్తి మండల కేంద్రంలో ఉదయం వాకింగ్ చేస్తూ గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలాడు. వెంటనే సీపీఆర్ చేస్తే అతను బతికేవాడు. ఆ సమయంలో సమీపంలో ఉన్న వారికి సీపీఆర్‌పై అవగాహన లేకపోవడంతో స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడు.

సీపీఆర్ ఎలా చేయాలంటే..



విద్యుదాఘాతానికి గురైె వ్యక్తి పడిపోతే చూడకుండా సీపీఆర్ ప్రయత్నిస్తే ప్రమాదం జరుగుతుంది. మొదట ఊపిరి తీసుకుంటున్నారా, లేదా నిర్ధారించుకోవాలి. నాడి కొట్టుకుంటుందో లేదా చూడాలి. ఈ రెండు లేకున్నా, అతి తక్కువగా ఉన్నా సీపీఆర్ చేయాలి. కుడి చేతి కింద ఎడమ చేయి పెట్టి వేళ్లను చొప్పించి లాక్ చేయాలి. ఛాతికి, పొట్టకు మధ్యలో ఎడమవైపు నిమిషానికి 120 సార్లు ప్రెస్ చేయాలి. నాలుగు నుంచి ఐదు సెంటీమీటర్లు లోపలికి వెళ్లేలా ఒత్తిడి చేయాలి. రెండు సార్లు నోటిలో నోరు పెట్టి గాలి పీల్చుకుని వదలాలి. ఈప్రక్రియ 5 నుంచి 10 నిమిషాల వరకు చేయాలి. మోచేతులు వంపకుండా మోకాళ్లను నేల మీద పెట్టి చేయాలి. ఈ లోపు మొదట అత్యవసర వాహనానికి సమాచారం అందించాలి.

– డాక్టర్ సిద్ధార్థరెడ్డి, ప్రభుత్వ వైద్యాధికారి, పాలకుర్తి

మండల సమగ్రాభివృద్ధే ధ్యేయం

● ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డిలను సన్మానిస్తున్న నాయకులు

కొడకండ్ల: వెనుకబాటుకు గురైన కొడకండ్ల సమగ్రావృద్ధే ధ్యేయంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. ఆదివారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మసురం రవీందర్ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు హైదరాబాద్‌లో వారిని కలిసి మండల అభివృద్ధి గురించి వివరించారు. తొర్రూరు నుంచి వెలిశాల మీదుగా హైదరాబాద్‌కు నేరుగా వెళ్తున్నాయని, వాటిలో కొన్నింటిని నాంచారిమడూరు కొడకండ్ల మీదుగా వెళ్లేలా ఏర్పాటు చేయించాలని, సూర్యాపేట, యాదగిరిగుట్టలకు ఆర్టీసీ బస్సు సౌకర్యాలు కల్పించాలని, బోడతండ మీదుగా తొండకు, కడగుట్టతండ నుండి తొండకు, బ్లాక్ ఆఫీస్ నుంచి మామిడాలకు రోడ్డును ఏర్పాటు చేయాలని నాయకులు ఎమ్మెల్యే, ఝాన్సీరెడ్డిలను కోరగా ప్రజల అవసరాలకు అనుగుణంగా సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని వారు తెలిపారు. మధుసూదన్, నాగరాజు, మనోహర్, ఎన్నం శ్రీనివాస్,మురళీ, సామాజిక కార్యకర్త దామెర సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీనాయక్‌కు సన్మానం



గాంధీనాయక్‌ను సన్మానిస్తున్న నాయకులు

కొడకండ్ల: జీసీసీ మాజీ చైర్మన్ ధరావత్ గాంధీనాయక్‌ను ఆదివారం గిర్నితండాలో గిరిజన నాయకులు సన్మానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ముగ్గురు పిల్లలు కలిగిన వారు పోటీ చేసే అర్హత లేనందున ఇట్టి నిబంధనను తొలగించాలని కోరుతూ గాంధీనాయక్ అనేక పోరాటాలు చేశారని, తాజాగా ఈ నిబంధనను ప్రభుత్వం రద్దు చేయడంతో మాజీ ఎంపీపీ జ్యోతి, మాజీ సర్పంచ్ రాజ్‌కుమార్‌లు హర్షం వ్యక్తం చేస్తూ గాంధీనాయక్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు మంగ్యానాయక్, వెంకన్న, సురేష్, సోమాని, నందు, రమేష్, రవీంద్రగాంధీ, భీమా, చందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలను పట్టించుకోని ప్రభుత్వం

● బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

జఫర్‌గఢ్: గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరిస్తుందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని తమ్మడపల్లి (జి) గ్రామంలో వెంకటేశ్వర్లు పార్టీ బృందంతో కలిసి పల్లెనిద్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముందుగా గ్రామంలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. చినుకు పడితే కాలనీలు బురదమయంగా మారుతున్నాయని, పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైందన్నారు. గ్రామాలాభివృద్ధి కోసం ప్రభుత్వం ఏమాత్రం నిధులు కేటాయించడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని పట్టించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా నాయకుడు ఎండీ వలిపాష, స్థానిక సంస్థల ఎన్నికల మండల కన్వీనర్ మారపల్లి రవి, నాయకులు పందిబోయిన రాజు, యాదగిరి, తాళ్లపల్లి సురేష్, రాపర్తి వినయ్, కుక్కల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ పదసంచాలన్



చిల్పూరు: ర్యాలీలో పాల్గొన్న కరసేవకులు



స్టేషన్‌ఘన్‌పూర్: ర్యాలీ నిర్వహిస్తున్న స్వయం సేవకులు

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది కార్యక్రమాల్లో భాగంగా ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం పద సంచాలన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లి శివాలయం వద్ద ప్రారంభించిన ర్యాలీని ఘన్‌పూర్ పురవీధుల గుండా స్థానిక బస్టాండ్ వరకు నిర్వహించారు. స్వయం సేవక్‌లు యూనిఫారాలతో ర్యాలీలో పాల్గొన్నారు. రూట్‌మార్చ్‌లో ముందు వాహనంపై భారతమాత, డాక్టర్ జి.గురూజీ చిత్రపటాలను ఉంచి హిందూ సమాజంలో జాగృతిని కల్పిస్తూ స్ఫూర్తిని నింపేలా భారత్‌మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్వయం సేవక్‌లు, ఆర్‌ఎస్‌ఎస్ అభిమానులు, బీజేపీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ పద సంచాలన్ ర్యాలీ

చిల్పూరు: మండలంలోని పల్లగుట్ట గ్రామంలో ఆదివారం ఆర్‌ఎస్‌ఎస్ పద సంచాలన్ ర్యాలీని కర సేవకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు. కార్యక్రమంలో కేశోజు నిరంజన్, బాల్నె శ్రీనివాస్, వెంకటస్వామి, సాదం వేణు, సంపత్, తప్పెట రాజు, రంగు సురేష్, కన్నెబోయిన రాజు తదితరులు ఉన్నారు.

కేజీకేఎస్ వార్షికోత్సవం



వార్షికోత్సవంలో కిరణ్ తదితరులు

నర్మెట: కల్లుగీత కార్మిక సంఘం(కేజీకేఎస్) వార్షికోత్సవాన్ని మండల కేంద్రంలో సంఘం మండల శాఖ అధ్యక్షుడు మూల కిరణ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెడా ఆవిష్కరించి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. మేనిఫెస్టోలో గీత కార్మికులకు ప్రకటించిన ఎక్స్‌గ్రేషియాను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం సలహాదారు గోపగోని శ్రీధర్, గౌరవ అధ్యక్షుడు యాదగిరి, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గుండేటి రాంచందర్, ఉపాధ్యక్షుడు బైరి యాదగిరి, సోషల్ మీడియా రాకేష్, రాజలింగం, బుర్ర నరేష్, చంద్రమౌళి, సతీష్, నవీన్, శంకర్, ముకుందం, శేఖర్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృత్యువాత



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రె పిల్లలు

తరిగొప్పుల: కుక్కల దాడిలో 10 గొర్రె పిల్లలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన మండలంలోని జాలుబాయితండాలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన సభావత్ పూల్య జీవాలను పెంచుకుంటూ జీవనోపాధి పొందుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా, ఆదివారం గొర్రె పిల్లలను ఇంటి సమీపంలోని దొడ్డిలో ఉంచి జీవాల మందను మేతకు తీసుకెళ్లాడు. ఎవరూలేని సమయంలో అటుగా వచ్చిన కుక్కలు దొడ్డిలోకి దూకి గొర్రె పిల్లలపై దాడికి తెగబడ్డాయి. ఈ దాడిలో 10 గొర్రె పిల్లలు అక్కడికక్కడే మృతిచెందాయి. సాయంత్రం దొడ్డి దగ్గరికి వెళ్లిన బాధితుడు మృతిచెందిన గొర్రె పిల్లలను చూసి కన్నీటిపర్యంతమయ్యాడు. దీంతో రూ.40 వేల ఆర్థిక నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు. గ్రామంలో 10 రోజుల వ్యవధిలో కుక్కల దాడిలో 20కిపైగా గొర్రె పిల్లలు మృతిచెందడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవతీసుకోని కుక్కల బారినుంచి తమ జీవాలను కాపాడాలని కోరుతున్నారు.

ఉపాధి కూలీలు ఈకేవైసీ చేసుకోండి

దేవరుప్పుల: జాతీయ ఉపాధి హామీ కూలీలు ఈ నెలాఖరులోగా జాబ్ కార్డుకు ఆధార్ లింకు(ఈకేవైసీ) చేసుకోవాలని ఈజీఎస్ ఇన్‌చార్జ్ ఏపీఓ ఉప్పునూతుల మోహన్ తెలిపారు. 32 గ్రామాల్లోని 13,095 కూలీల్లో 9,413 మంది కూలీలు లింకు చేసుకున్నారని, మిగితా కూలీలు విధిగా ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్ల వద్దకు వెళ్లి ఈకేవైసీ చేసుకోవాలని సూచించారు. నిర్దేశిత సమయంలో ఈకేవైసీ చేసుకోన్నట్టయితే ఉపాధి పని కల్పనతోపాటు బిల్లుల చెల్లింపు ప్రక్రియ నిలిపివేస్తారని తెలిపారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



స్టేషన్‌ఘన్‌పూర్: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న లావణ్య



తరిగొప్పుల: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఉపేందర్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్టేషన్‌ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్యశిరీష్‌రెడ్డి అన్నారు. మండలంలోని తాటికొండ గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, ఐకేపీ సీసీ సహదేవ్, స్వర్ణ విజయ మండల సమాఖ్య అధ్యక్షురాలు బేతి మంజుల, నాయకులు చల్లా సుధీర్‌రెడ్డి, రాపోలు మధుసూధన్‌రెడ్డి, మారపాక వసంత్, స్పందన గ్రామైక్య సంఘం బాధ్యులు కాసర్ల సొమ్య, ఎండీ. ఖలీదాబేగం, కవిత, వీఏఓలు సరిత, హైమ, రైతులతోపాటు తదితరులు పాల్గొన్నారు.



చిల్పూరు: లింగంపల్లిలో..

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

చిల్పూరు: గిట్టుబాటు ధరతో పాటు సన్నాలకు బోనస్ కావాలంటే కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించాలని స్టేషన్‌ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ లావణ్య అన్నారు. మండలంలోని వెంకటాద్రిపేట, శ్రీపతిపల్లి, లింగంపల్లి గ్రామాల్లో ఆదివారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఏఈఓలు నరసింహులు, అఖిల నాయకులు బొమ్మిశెట్టి బాలరాజు, గడ్డమీది సురేష్, రంగు రమేష్, కర్ణాకర్‌రెడ్డి, ఊమ్లా, కండ్లకోలు బాలరాజు, ఏదునూరి రవీందర్, గాలి రాజు తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

తరిగొప్పుల: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని హైదరాబాద్ సిటీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ (డీసీసీబీ డైరెక్టర్)కేశిరెడ్డి ఉపేందర్‌రెడ్డి కోరారు. మండలకేంద్రంతోపాటు బొంతగట్టునాగారం, అంకుషాపూర్, సోలిపురం గ్రామాలలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు వగలబోయిన యాదగిరి, ఏఎంసీ డైరెక్టర్ అర్జుల పోషిరెడ్డి,ప్యాక్స్ డైరెక్టర్లు అర్జుల సుధాకర్‌రెడ్డి, సుంకరి రాజయ్య ,నాయకులు పండుగ కనుకయ్య, నరహరి, ఇంద్రారెడ్డి, శివకుమార్, సదయ్య,లూకా,సాయిరెడ్డి, భీమా నాయక్, కల్వరాజు,పోషయ్య,చంద్రయ్య, సమ్మయ్య, మహేందర్‌కర్ పాల్గొన్నారు.

సాగుచేసిన పంటలు నమోదు చేసుకోవాలి

బచ్చన్నపేట: రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఏఈఓల వద్ద నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి విద్యాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పంటల వివరాలను సర్వే నంబర్ల వారీగా నమోదు చేసుకోవాలని, అప్పుడే ఆ పంటలను విక్రయించడానికి సులువుగా ఉంటుందన్నారు. ముఖ్యంగా పత్తి పండించిన రైతులు కపాస్ కిసాన్ యాప్ ద్వారా సీసీఐలో విక్రయించాల్సి ఉంటుంది కావున ముందుగా నమోదుతోపాటు ఫోన్ నంబర్లను కూడా ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

జఫర్‌గఢ్: మండలంలోని ఉప్పుగల్లు గ్రామంలో లయన్స్ క్లబ్ ఆఫ్ శివునిపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డయాబెటిస్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 40 యునిట్ల రక్తాన్ని సేకరించడంతో పాటు 50 మందికి షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్‌పీడీసీ పుట్ట హరికిషన్ మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న మరొకరి ప్రాణం కాపాడవచ్చన్నారు. అలాగే మూడు నెలలకు ఒక సారి రక్తదానం చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో జోన్ చైర్మన్ కరుణాకర్‌రెడ్డి, శివునిపల్లి క్లబ్ సెక్రటరీ పులి వినయ్‌కుమార్, స్టేషన్‌ఘన్‌పూర్ క్లబ్ ట్రెజరర్ కోతి అశోక్, క్లబ్ ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని పేదలకు పంచుతాం

● సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి



మాట్లాడుతున్న కనకారెడ్డి

జనగామ రూరల్: మండలంలోని ఎర్రగొల్లపహాడ్ గ్రామంలోని ప్రభుత్వ సీలింగ్ భూములను కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమాలకు పాల్పడి ప్రభుత్వ భూములను అమ్ముకుంటున్నారని, ఆ భూమిని ప్రజలకు పంచుతామని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. ఆదివారం గ్రామ కార్యదర్శి గుండెల్లి రాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో ఉన్న 100 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమిని కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా ఆక్రమించుకొని, ఆ భూమికి సంబంధం లేని సర్వే నంబర్లు వేయించి రిజిస్ట్రేషన్ చేస్తూ రూ. లక్షలు దండుకుంటున్నారని అన్నారు. కలెక్టర్ స్పందించి సర్వే చేయించి ప్రభుత్వ భూములను బయటకు తీసి వాటిని నిరుపేదలకు ఇళ్ల కోసం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బోడ నరేందర్, ఉపేందర్ , బైరగోని మల్లేష్ పుట్టపాక రాజు, అజ్మీరా సురేష్, రజిత, నర్సయ్య, ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

లింగాలఘణపురం: మండలంలోని గుమ్మడవెల్లి వద్ద ఆదివారం ఆటోను బైక్ ఢీకొనడంతో ఆటోలో వెళ్తున్న అదే గ్రామానికి చెందిన కూలీ గోసంగి లలితకు, బైక్‌పై వెళ్తున్న మహ్మద్ హుస్సేన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. లలిత కూలీ పని కోసం ఆటోలో జీడికల్ వైపు వెళ్తుండగా హుస్సేన్ అతని స్నేహితుడు అంకూస్ జీడికల్ నుంచి గుమ్మడవెల్లికి బైక్‌పై వస్తుండగా కొమ్మాయిపల్లి, జీడికల్ క్రాస్ రోడ్డు వద్ద ఆటోలో కూర్చున్న లలితను ఢీకొట్టడంతో కుడి కాలు విరిగింది. బైక్‌పై వెళ్తున్న హుస్సేన్ తలకు, కాళ్లకు గాయాలై అపస్మారక స్థితిలో ఉండడంతో దేవరుప్పుల, జనగామకు చెందిన 108 అంబులెన్స్‌లు వచ్చి వారిని జనగామ జనరల్ ఆస్పత్రికి తరలించారు. హుస్సేన్ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. 108 ఈఎంటీలు రాకేశ్, రాధిక వైద్య సేవలు అందించగా పైలెట్లు అనిల్, సాయి సకాలంలో గాయాలైన వారిని జనగామకు తరలించారు.